# కీలు కత్తిపీట

సీతమ్మగారింటికి రాగానే, కామాక్షమ్మగారి కంటి కగుపించినది రాసిగా పోసున్న మాఁవిడికాయలు!- వాటిని చూడ్డంతోనే— "ఇంకా తరగలేదేఁవిటి?" అని అడిగింది కామాక్షమ్మ గోడకు చేరబెట్టివున్న పీటను తనే స్వయంగా వాల్చి కూర్చుంటూ.

"ఎలా తరగడం చెప్పండి!-మా మూమ్మాలు కత్తిపీటతో నేనివి తరగలేనాయె! — కీలు కత్తి పీటకోసం ఉదయం నుంచీ వ్యాపకం చేస్తున్నాను. కానీ ఉన్నా లేదనేస్తున్నారు కొందరు వాళ్ళకొంపే మునిగిపోతుందన్నట్టు" అంది సీతమ్మ తనూ ఓ పీట తెచ్చుకొని ఎదురుగా వేసుకొని కూర్చుంటూ!

"ఏం!— రవణమ్మగారింట్లో ఓటున్నాదిగా!— ఆవిణ్నడిగేరా?"

"అడక్కేం?— అందరికన్నా ముందావిడనే అడిగేను. చక్కా లేదని చెప్పేసింది."

"ఏమిటీ? లేదని చెప్పేసిందా!— బలేబాగుంది వరస!— మేమే అమ్మేసేమండీ వాళ్ళకో కీలు కత్తిపీట ఆరురూపాయలకు!— అంత నిర్మొహమాటంగా ఎలా చెప్పేసిందోగానీ. అంత మహా బోడిభాగ్యానికీ ఆ దాపరిక మెందుకు చెప్పండి."

"ఏమో మరి!— ఓ అరగంటలో ఇచ్చేస్తా ఓమా రివ్వండి అని అడిగా —"

"అయ్యో! ఏం మహాభాగ్యంగనక!— ఉంటే ఇవ్వ నుటండీ." అందామె. అలా ఆమె అన్నా నేనూరుకోలేదు. కామాక్షమ్మగారు మీకామధ్యని అమ్మేసిన దోటుండాలి గదా! అనడిగాను నిలవదీసి!— 'ఓహో!— అదా మా తమ్ముడిగారికి కావాలంటే ఇచ్చేసేమండీ!—' అంది. ఇకే మనడిగేది చెప్పండి."

"అదేవిటండీ అంత దాపరికం!— వాళ్ళతమ్ముడు గారికివ్వలేదూ యెవళ్ళకీ యివ్వలేదు. వాళ్ళింట్లోనే ఉంది!- నాకా సంగతి బాగా తెలుసు. తమ కత్తిపీట అరిగిపోతుందే మోనని భయం కాబోలు!" అంది కామాక్షమ్మ చేతు లూపుకుంటూ.

"ఏమో మరి!— లేదు అని ఖచ్చితంగా చెప్పేసిం దామె!" అంది సీతమ్మ.

"అసలామె తత్వమే అంతండి!— ఆ మధ్యని మా అక్కా బావా వచ్చినప్పుడు 'కొంచెం మజ్జిగ చుక్కుంటే యివ్వండి రవణమ్మగారూ!' అని నోరువిడిచి అడిగేను. వాళ్ళకి రెండు పాడిగేదె లున్నాయికదా అని. ఏమందో తెలుసాండి!—'అయ్యో పిన్నిగారూ!—అడక్కడక్క అడి గేరు— నిజంగా నాకెంతో చిన్నతనంగా ఉంది లేదని చెప్పడానికి!— నిన్నమా పాలన్నీ కుండలో ఉంచి పొయ్యి మీద పెడదామని అనుకుంటూ వుండగానే మా నానిగాడు కుండెడు పాలనూ తిరగతోసేసేడు. ఇవాళ్టికి మేమే కొంచెం

మజ్జిగ కొనుక్కున్నాము." అంది. అవాళ మధ్యాహ్నం వాళ్ళ అప్పారావుగాడ్ని పిలిచి అడిగేను, నిజం తెలుసుకుందామని!— అవాళ వాళ్ళు చక్కా పెరుగూ అన్నం తిన్నారట!—మరి చూశారా ఆమె లోభత్వం!—కాసింత మజ్జిగ చుక్కిస్తే ఏమయిపోతుంది చెప్పండి! ఊరికినే పార బొయ్యడానికి ఒప్పకుంటుందిగాని, మనలాంటివాళ్ళకో యింత ఇవ్వడానికి దాని మనసొప్పదండీ!" అని రవణమ్మ మీద తనకున్న కుళ్ళనంతటినీ వెళ్ళగక్కింది కామాక్షమ్మ.

"ఇంకో గమ్మత్తు చూసేరుకారు!— తెల్లారి లేచి మనింటికి చీటిక్కీమాటిక్కీ వచ్చేసి ప్రతీదీ పట్టుకెళ్ళిపోతుంది. మా యిడ్డెన్లపాత్ర నాల్గునెలల క్రిందట పట్టుకెళ్లిపోయింది వాళ్ళింటికెవరో చుట్టాలొచ్చేరు ఇడ్డెన్లు పెట్టాలంటూ!— ఇప్పటివ్వలేదు చూడండెలాగుందో! ఇవాళెలానూ కబురు పెడతానిచ్చెయ్యమని. మనకు కతిపీట యివ్వడానికి అంతలా చస్తున్నప్పుడు నేనుమాత్రం ఎందుకివ్వాలి ఏదయినా? ఇక నుంచీ నేనూ ఏవీ యివ్వను. అక్కడికి కడుతుందా రోగం!— మనలో మనం ఏది లేకపోయినా సర్దుకుపోవాలిగాని. ఇలా ఒంటెత్తుగా వుంటే యెలా చెప్పండి." అన్నది సీతమ్మ.

"ఆఁ!— మీ యింట్లోంచి ఇడ్డెన్లపాత్ర పట్టుకెళ్ళిపోయిందేవిటి!— మా యింట్లోంచి పులుసు గంగాళం పట్టుకెళ్ళిపోయిందారు నెలలక్రిందట! — డబ్బుండికూడా వాళ్ళకి ముష్టిబ్రతుకెలావుందో చూడండి!— మనిళ్ళకొచ్చి అన్నీ పట్టుకెళ్ళిపోతుంది గాని, మనవసరానికి ఉన్నా ఇవ్వదు!— వెధవబాధ నామనస్సెలాంటిదో అంటే అపతల

వాళ్ళు నోరు విడిచి అడిగినప్పుడు ఉండికూడా లేదనడం నాకు చేతకాదు సుమండీ ఆ రవణమ్మలాగ! ఆఖరికి నాస్వంత పన యినా మానుకొని యిచ్చేస్తాను— అన్నట్టు యిప్పుడు మీయింటికి వచ్చిన పనే మరిచిపోయాను!— కొంచెం చింతపండుంటే బదులిద్దురూ?... మా ఆయన కొన్న వెంటనే ఇచ్చేస్తాను." అనడిగింది కామాక్షమ్మ.

కామాక్షమ్మ ఏదో వొకటి బదులడగడానికే వచ్చుం టుందన్న సంగతి సీతమ్మకు మొదటే తెలుసు!— అదివర కప్పుడే ఓ రెండునెలల క్రిందట కామాక్షమ్మ రెండడ్డల కంది పప్పూ, ఓ అడ్డెడు పెసరపప్పూ ఓ వీశెడు పంచదార బదులు పట్టుకెళ్ళి ఆ ఊసే మరచిపోయినట్టు అంతవరకూ యివ్వనేలేదు. ఇక చిల్లరగా పట్టుకెళ్ళిన ఉప్పనీ, జీలకర్రనీ, ధనియాలనీ యిలాంటివాటికి లెక్కేలేదు. అలా ఆమె పట్టు కెళ్ళడమేగాని తీరా తన కవసరం వుండి ఏమయినా అడిగితే రవణమ్మను మించిపోయేటట్లు నిర్మొహమాటంగా లేవని చెప్పేస్తుంది! - ఆరోజున తనభర్త స్నేహితుడొకడింటికి వచ్చినప్పుడు బియ్యం నిండుకోగా, ఆమె నడిగితే— "అయ్యో!... అక్కయ్యగారూ! నేనే మీయింటికొచ్చి అడుగుదామనుకుంటున్నాను వాటిని!" అని చక్కటిభాషలో చెప్పేసింది. పైగా ప్రతీ ఒక్కరినీ విమర్శిస్తుందని సీతమ్మ కామెపై కోపం! - నిజానికి కీలుకత్తిపీట కామాక్షమ్మఇంట్లో ఓటుందని సీతమ్మకు తెలిసింది. ఇక అడగడానికి అదే సమయమని -

"జానుగానీండీ!... మీయింట్లోకూడా ఓ క్లీలుకత్తి

పీటుందని రవణమ్మ చెప్పిందండీ! - ఉంటే ఓమాటిస్తురూ!" అనడిగింది.

"ఇదొకటా!...బాగానేఉంది. మాయింట్లో ఉంటే మీకియ్యడానికి కేంపోయింది చెప్పండి?...ఆరోజుల్లో డబ్బుకి కొంచెం రొక్కటంగా ఉండటం మూలాన, అది వాళ్ళకి అమ్మేసేము, ఆరురూపాయలకి. మాయింట్లో ఎక్కడుంది చెప్పండి?...ఇంట్లో ఉంచుకొని లేదనడమే చాల్చాలు!...పైగా మాయింట్లో ఉందనికూడా చెప్పిందేంవిటి...బాగుబాగు !!

"ఏమోమరి!... మీకు రెండుకత్తిపీటలుండేవనీ-రెండు మీ కనవసరమవడంవల్ల ఓటివారి కమ్మేసేరనీ... ఆకొన్నది వాళ్ళ తమ్ముడిగారికి కావాలంటే ఇచ్చేసేరనీ-మీయింట్లోమాత్రం ఓటుందనీ ఆమెకాసంగతి బాగా తెలుసుననీ చెప్పింది."

"ఎంత బొంకులాడి!...నామీద మీకు చెడ్డఅభిప్రాయం కలగడంకోసం అలాచెప్పింది తెలుసాండీ!... అబ్బోస్!—అదెక్కడ...జిత్తులమారిది!!-ఇంతకీ నాసంగతెలాంటిదో మీకు తెలుసు గనక సరిపోయిందిగానీ-లేకపోతే మనకీ మనకీ జట్టీ పెడదామనే కదా దానుద్దేశ్యం?"-

"అబ్బే!- రవణమ్మ మాటలను ఆధారంగా తీసుకొని నేను నమ్మలేదులెండి!-కానీ మీయింట్లో రెండుకత్తిపీటలుండేవని నరసమ్మగారుకూడా చెప్పేరు?"

కామాక్షమ్మగుండె దిగజారిపోయినట్టయింది. దానికి సమాధానం తడువుకోవలసివచ్చింది. కానీ కొంచెం

గడుసుదవడంచేత త్వరలో తేరుకొని- "ఔను-రెండు మాయింట్లో ఉండేవి ఒకప్పుడు!-ఆ విషయం నిజమే!— అందులో ఓటి మాపుట్టింటారిది. ఆమధ్య మక్కువనుంచి మానాన్నగారికి బల్జిపేట ట్రాన్స్ఫరయినప్పుడు, అక్కడ ఇల్లు దొరక్కపోవడంచేత, సాలూరులో దిగి మాయింట్లో సామానంతా వారి సామానంతాఉంచేసేరు. ఆసామాన్లతో పాటు వాళ్ళ కీలుకత్తిపీటకూడా కొన్నాళ్ళపాటు మాయింట్లో ఉంది! ఇప్పుడు అక్కడ వాళ్ళకు ఇల్లు దొరకడంచేత ఈమధ్యనే వారి సామానంతా పట్టుకెళ్ళిపోయేరు. మాకు మాత్రం ఒక్కటే ఉండేది. ఆ ఉన్నదాన్నొక్కటీ రవణమ్మ గారికి అమ్మేసేం!-అంతే!"

"సరే. దానికేంలెండి!-అంతగా కీలుకత్తిపీటదొరక్కపోతే మామూలు కత్తిపీటతోటే మావారిని కోసేయమంటాను! చేతనయితే తనుకోస్తారు లేకపోతే కూలివాళ్ళని పెడతారు. అంతగా కాకపోతే క్రొత్తది కొంటారు!!" అంది సీతమ్మ మంచి హుందాతనంతో.

"శుభ్రంగా ఓటి కొనేసుకుందురూ శాశ్వతంగా వుంటుంది, ఎందుకొచ్చిన బాధ వాళ్ళనీ వీళ్ళనీఅడగడం?! హాయిగా మాలాంటివాళ్ళకికూడా సదుపాయంగా ఉంటుంది!" అంది కామాక్షమ్మ కొంచెం కొంచెంగా నవ్వుతూ.

ఏడిసినట్టుందనుకుంది సీతమ్మ!

చింతవండు అప్పు యిచ్చినప్పుడు, లోగడ పట్టు

కెళ్ళిన బహుళ్ళవిషయమై జ్ఞాపకం చేసింది! అంతలా అడుగుతుందనుకోలేదు కామాక్షమ్మ!!-

* * *

"అయితే సీతమ్మగారూ!...ఎలాఅయితేనేం కామాక్షమ్మ కత్తిపీటిచ్చిందన్నమాట...ఇక నివేళేదో పెద్ద ప్రళయం తప్పదు." అంది రవణమ్మ అక్కడ గోడకు చేరబెట్టివున్న కీలుకత్తిపీటవేపు చూస్తూ.

"అబ్బే. మనఃపూర్వకంగా ఇవ్వాలనుండి యివ్వలేదామె." అంది సీతమ్మ పిల్లాడి కన్నంకలుపుతూ.

సీతమ్మ కూర్చోమని చెప్పకపోయినా తనే స్తంభానికానుకొని చతికిలపడి కూర్చుంది రవణమ్మ. మళ్ళీ గొంతు సవరించుకొని-"అయితే యీకత్తిపీట మీయింటి కెలా వచ్చింది?" అనడిగింది.

"మా ఆయన తీసుకొచ్చేరు మీరులేదన్నతరవాత మీమాట నాధారం చేసుకొని, కామాక్షమ్మగారిని కూడా అడిగేను. ఆమెకూడా అతిమృదువైన భాషలో లేదని చెప్పేసింది!...కీలుకత్తిపీటెక్కడా దొరకలేదని చెప్పేను. 'సరే నే తెస్తానుండ'ని ఆయన- ఈకత్తిపీట తెచ్చేరు. 'ఎక్కడినుంచి తెచ్చేరని అడిగితే, 'కామాక్షమ్మగారింటి దగ్గర్నించే' అన్నారు. నేనెంతైనా ఆశ్చర్యపోయానంటే నమ్మండి. అయితే మీకెలా యిచ్చిందండీ ఇది?— అనడిగేను-'పాపం, ఆమెభర్త యిచ్చాడు. అటకమీంచి తీసి!...ఆయన నాకిది యిచ్చేడన్నసంగతి పాపం కామా

తమ్మగారికి ఇప్పటిక్కి తెలిసుండదు. అన్నారు.” అంది సీతమ్మనవ్వుతూ.

“చూసేరా....మరి ఇంట్లో ఉంచుకొనే ఎలా చెప్పేసిందో....ఆ కామాతమ్మ తత్వమే అలాంటిదని నే మొదటినుంచీ చెప్తున్నాను కదండీ....పైగా ఈర్ష్య కొద్దీ నామీద అన్నీ చెపుతూ ఉంటుంది.” అంది రవణమ్మ తనో నిజాయితీగల మనిషిననే భావం వ్యక్తం అయేలా. “నిజమేలెండి....ఆకత్తిపీట మీకమ్మేసినట్టూ అది మా యింట్లోనే ఉందన్నవిషయం తను ఋజువు చేయగలననికూడా చెప్పింది.... మీకెందుకంత శ్రమ, మీయింట్లోవుంటే యివ్వండి, లేకపోతే ఊరుకోండి అని ఖచ్చితంగా చెప్పేసేను.”

“మంచిపని చేసేరు....ఇంతమహావస్తువూ అరిగిపోతుందనే గాబోలు లేదని చెప్పేసింది. ఏం మహాభాగ్యం గనక!–కానీ ఇప్పుడు దానికే బలే పరాభవం జరిగిందిలెండి... వాళ్ళాయన దాన్లాగా కాకుండా చాలా మంచివాడు. అదీ గాక మీఆయన, మాఆయన, వాళ్ళాయన ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు కదండీ.... మరా పరిచయంమీద మీఆయన అడగ్గానే వెంటనే యిచ్చేడాయన. ఇంతకీ ఆమొగాళ్ళకున్న పాటిబుద్ధి మన అడవాళ్ళకు లేదండీ...అందుకే మనాడవాళ్ళ బ్రతుకు లిలా కాలుతున్నాయి...చాలా చిన్నవిషయాలను పెద్దవిషయాలుగా చేస్తూ, ఒకరిమీద ఒకరు పోటీలు చెప్పుకుంటూఉండడం మనాడవాళ్ళలో ఉన్న

ఓ పెద్దజబ్బు... అందులోక్కి బొత్తిగా ఆ కామాక్షమ్మ ఉందే..."

"ఇష్! ... ఆగండి రవణమ్మగారూ!...అదుగో కామాక్షమ్మగారు వస్తున్నారు" అంది సీతమ్మ.

కామాక్షమ్మకూడా లోపలకువచ్చి కూర్చొంది. పాపం ఆమె ఇంకా గోడవారనున్న కత్తిపీటవేపు చూడలేదు. తరిగిఉన్న మామిడికాయలనుమాత్రం చూసింది.

"ఆఖరికిది ఎలా తరిగించేసేరు?" అనడిగింది.

"బలే!...తెలీనట్టు మాట్లాడుతున్నారే! కత్తిపీట మీ యింట్లోంచే తెచ్చినట్టు చెపుతున్నారే సీతమ్మగారు!" అంది రవణమ్మ.

"మాయింటి నుంచా!...ఏదీ?" అని అటూయిటూ చూసింది కామాక్షమ్మ.

"మా ఆయన తీసుకొచ్చేరు!...నిన్న సాయంత్రం మీ ఆయన నడగ్గా పాపం అప్పుడు అటకెక్కి తీసియిచ్చేరుట!...అప్పుడు మీరు వంటింటిలో వంట చేసుకుంటున్నారుట!..."

కత్తిపీటవేపు చూస్తూ నిర్ఘాంతపోయింది కామాక్షమ్మ!-తనపరువు రవణమ్మముందు అమాంతంగా నట్టేట్లో కలిపేసినందుకు వాళ్ళాయన పిలకపట్టుకు ఝాడించేయాలనిపించింది కామాక్షమ్మకు!—బొంగురుపోయిన గొంతుకతో —"అయితే మా నాన్నగారు వాళ్ళసామానులు పట్టుకెళ్ళినప్పుడిది మరచిపోయారు కాబోలు అటకమీద!...నే నింత

వరకూ పట్టికెళ్ళిపోయారనేఅనుకుంటున్నాను" అని యెలానో సమర్థించబోయింది కామాక్షమ్మ.

కామాక్షమ్మ పడుతున్న బాధ చూసేసరికి బాగా నవ్వు వచ్చింది సీతమ్మకు. మళ్ళీ అంది—"ఏదో మీ యిద్దరి ధర్మమాఅంటూ రెండు కత్తిపీట లుండబట్టి మా ఆయనా నేనూ కలిసి త్వరగా కోసేసేము!... ఇక మీ కత్తిపీటలు మళ్ళీ అటకమీద పెట్టేసుకోవాలనుంటే తీసుకుపొండి!" అంది సీతమ్మ కొంచెంకొంచెంగా నవ్వుతూ.

"ఇదికాక ఇంకో టెక్కడిదీ?" అనడిగింది ఆశ్చర్యంతో రవణమ్మ.

"మీ ఆయన్నికూడా అడిగేరు మావారు!...ఏదో మంచివారు కాబట్టి యిచ్చేరు మాలనున్నది బైటకుతీసి! ...అదుగో ఆ చావవారున్నది మీ కత్తిపీట" అని అంది సీతమ్మ అటువేపు చూపించి నవ్వుతూ!...

రవణమ్మ ముఖంకూడా తెల్లబోయింది. ఇద్దరూ ఉడుకుమోత్తనంగా లేచి, గిరుక్కున వెనక్కితిరిగేరు, వారి వారి భర్తల అంతు కనుక్కునేందుకు!!—

———